
సాక్షి ఒడిశా

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 4,54,814
బంగారం 540 మిల్లీ గ్రాములు
వెండి 16 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

\- భువనేశ్వర్/పూరీ



జోరుగా..హుషారుగా..

పోలింగ్ సమీపిస్తుండటంతో అభ్యర్థులు ప్రచారాల జోరు పెంచారు. గెలుపే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు.

- 8లో



మే 10 నుంచి ధను జాతర

ధను జాతర నిర్వహణకు సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. మే నెల 10 నుంచి 17 వరకు ఉత్సవం నిర్వహిస్తామని కమిటీ ప్రకటించింది.

- 8లో

న్యూస్‌రీల్

పేదలకు సరుకుల వితరణ



నిత్యావసర సరుకులతో పేదలు

రాయగడ: స్థానిక రైతుల కాలనీలో జనజీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం 35 మంది ఆదివాసీ నిరుపేదలకు బియ్యం, పప్పు, ఉప్పు, వంటనూనె, బంగాళదుంపలు వంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రతి నెలా ట్రస్ట్ ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు ఎం.నళిని తెలిపారు.

ఆప్‌లో చేరిన బీజేడీ యువనేతలు



ఆప్‌లో చేరిన గౌరీచరణ్ దేవశర్మ, గోండ్‌లతో నిశికాంత మహాపాత్రో

జయపురం: కొరాపుట్ జిల్లా యువ బీజేడీ ఉపాధ్యక్షుడు గౌరీచరణ్ దేవశర్మ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)లో చేరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని ఆప్ రాష్ట్ర కార్యలయంలో ఆ పార్టీ కండువా ధరించారు. ఆయనతో పాటు అనుచరుడు జాకబ్ గోండ్ కూడా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు నిశికాంత మహాపాత్రో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గౌరీచరణ్ దేవశర్మను కొరాపుట్ జిల్లా ఆప్ అధ్యక్షుడిగా ప్రకటించారు.పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయినిపై సస్పెన్షన్ వేటు



సంఘమిత్ర మల్లిక్

భువనేశ్వర్: బౌద్ జిల్లాలో ఓ రాజకీయ పార్టీ నిర్వహించిన ఎన్నికల ప్రచారం, ఊరేగింపులో పాల్గొన్నారనే ఆరోపణలపై ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయినిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. ఆమెను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దహ్యా ప్రభుత్వ నోడల్ ఉన్నత పాఠశాలకు చెందిన సహాయ ఉపాధ్యాయిని సంఘమిత్ర మల్లిక్ సంఘమిత్ర మల్లిక్ రెండు రోజుల క్రితం బౌద్ జిల్లా కొంటామల్ శాసనసభ నియోజకవర్గంలో పలాస్‌పట్ నుంచి అంబొగాంవ్ వరకు నిర్వహించిన రాజకీయ ర్యాలీలో పాల్గొన్నారు. దీనిని క్రమశిక్షణ ఉల్లంఘణ చర్యగా భావిస్తూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు బౌద్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ అందిస్తున్న ఐఐసీ స్వయి

రాయగడ: ఎండల తీవ్రత నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు గుడారి పోలీసులు చర్యలు చేపట్టారు. గుడారి కూడలిలో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తాగునీటితో మజ్జిగ వితరణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఐసీ సమీర్ పితాస్వయి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నికుంజా బిహారి దల్

బరంపురం : దక్షిణ ఒడిశాలోని గంజాం, గజపతి, కోంధమాల్, బౌద్ జిల్లాల్లో వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అందరూ కృషి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నికుంజా బిహారి దల్ కోరారు. గంజాం కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, ఎస్పీ జగ్మోహన్ మీనాతో కలిసి శుక్రవారం ఛత్రపూర్‌లోని డీఆర్‌డీపీ సమావేశ మందిరంలో ఎన్నికల సమీక్ష నిర్వహించారు. ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి తరలింపుపై చర్చించారు.



మాస్టర్ క్యాంటీన్ ప్రాంతంలో నగరానికి స్వాగతం పలుకుతూ నేమ్‌బోర్డు



నగర చారిత్రక విశేషాలకు అద్దం పట్టిన ఫొటో ప్రదర్శన



కాంతులీనుతున్న కృషి భవన్

భువనేశ్వర్ @ 76

- ఘనంగా రాజధాని వ్యవస్థాపక దినోత్సవం
- ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 1948 ఏప్రిల్ 13న దేశ తొలి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ రాజధాని నగరానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జయదేవ్ భవన్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. భువనేశ్వర్ గురించి అంతగా తెలియని కొన్ని కథలు, వాస్తవాలను ఫొటోల రూపంలో ప్రదర్శించారు. ప్రఖ్యాత జర్మన్ ఆర్కిటెక్ట్ ఒట్టో కోయినిగ్స్‌బెర్గర్ 1948లో సుమారు 40వేల జనాభా కోసం నగరం మొదటి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. అప్పటి నుంచి భువనేశ్వర్ ఆధునిక వాస్తుశిల్పం, నగర ప్రణాళికలో ఒక నమూనాగా మిగిలిపోయింది.

- భారత ప్రభుత్వం స్మార్ట్ సిటీ ప్రతిపాదనలో భువనేశ్వర్ 78.83 పాయింట్లతో దేశంలోనే అత్యుత్తమ నగరాల్లో మొదటి స్థానంలో నిలిచి పూర్వ సంకల్పానికి పట్టం గట్టింది. భువనేశ్వర్ అనే పేరు త్రిభువనేశ్వర్ నుంచి వచ్చింది. భువనేశ్వర్ ఒకప్పుడు దాదాపు 700 దేవాలయాలకు నిలయంగా ఉండేది. నేటికీ వందలాది పురాతన ఆలయాలు దర్శనం ఇస్తుండటంతో ఆలయ నగరిగా పేరొందింది.
- రాజధాని స్థాపన దినోత్సవం సందర్భంగా నగరంలో లోక్ సేవా భవన్, రాష్ట్ర శాసనసభ, కమిషనరేట్ ఆఫ్ పోలీస్ కార్యాలయ భవనంతో పాటు ఇతర ప్రముఖ ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు అలంకార దీపాలతో దేదీప్యమానంగా వెలిగిపోయాయి.
- భువనేశ్వర్ స్థాపన దినోత్సవ వేడుకల్లో భాగంగా నగరంలో కళాశాలల విద్యార్థులు ఉదయం పౌర పరేడ్, మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అరుణ్‌కుమార్ షడంగి, కమిషనర్ ఆఫ్ పోలీస్ సంజీవ్ పండా తదితర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.



నగర శంకుస్థాపన శిలాఫలకం ఆవరణలో ప్రముఖులు

తారలు దిగి వచ్చిన వేళ..!

- వ్యూహాత్మకంగా బీజేడీ కార్యాచరణ
- ఏం జరుగుతుందోనని ఆశావాదుల్లో ఉత్కంఠ

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికలకు బిజూ జనతా దళ్ అధిష్టానం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. నామినేషన్ల ఘట్టం సమీపిస్తున్నా ఇంత వరకు పూర్తిస్థాయి అభ్యర్థుల జాబితా ఖరారు కాలేదు. విడతల వారీగా అభ్యర్థుల్ని ఖరారు చేస్తూనే మరో వైపు ప్రచార పర్వాన్ని పకడ్బందీగా రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలో అసమ్మతి ప్రేరణకు తావులేకుండా ప్రచార కమిటీ ఖరారు చేశారు. ఇప్పుడు సినీ తారల వైపు దృష్టి సారించారు. అదే సమయంలో అభ్యర్థిత్వం ఖరారైన వారికి ప్రచార శైలి పట్ల అవగాహన పరుస్తున్నారు. దీంతో నవీన్ నివాస్ పరిసరాలు హడావిడిగా కనిపిస్తున్నాయి. అభ్యర్థిత్వం కోసం ఆశావాదులు, గెలుపే లక్ష్యంగా అధినేత సూచనల కోసం అభ్యర్థులు బారులు తీరుతున్నారు. నవీన్ పట్నాయక్ పిలుపు అందుకున్న ఓలీవుడ్ సినీ తారల ఆగమనంతో ముఖ్యమంత్రి నివాసం రద్దీగా తారసపడుతోంది.

సర్వత్రా ఉత్కంఠ..

ప్రధానంగా సినీ తారల రాకతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంటోంది. బీజేడీ అభ్యర్థుల జాబితా పరిపూర్ణం కాలేదు. ఈ ప్రక్రియ కోసం ఓలీవుడ్ తారలకు పిలుపు అందినట్లు పలు వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల పలువురు అగ్ర శ్రేణి చలన చిత్ర ప్రముఖులు బీజేడీని వీడారు. ఈ లోటుని భర్తీ చేయడంలో నవీన్ పట్నాయక్ తలమునకలైనట్లు సమాచారం. బాబూ షాన్, పప్పు పమ్‌పమ్, అమ్లన్ దాస్, శైలేంద్ర, అశ్విని త్రిపాఠి, ప్రజ్ఞ, భూమిక, సుప్రియ, ప్రేరణ, తారిఖ్ అజీజ్ వంటి ఒడియా చలన చిత్ర నటులు, నటీమణులు మరియు గాయకులు తాజాగా నవీన్ నివాసానికి వెళ్లారు.



నవీన్ నివాస్ వైపు వెళ్తున్న ఓలీవుడ్ తారలు

పరిశ్రమ బాగోగులపై చర్చ..

నవీన్ నివాస్‌లో సుదీర్ఘ చర్చ తర్వాత బయటకు వచ్చిన ఓలీవుడ్ ప్రముఖులు మాట్లాడుతూ చలన చిత్ర రంగం పురోగతికి ముఖ్యమంత్రితో చర్చించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం, పోటీ, బిజూ జనతా దళ్ అభ్యర్థిత్వం వంటి అంశాలతో ఎటువంటి సంబంధం లేదని పప్పు పమ్‌పమ్ తెలిపారు. సినీ పరిశ్రమపైనే ప్రధానంగా చర్చ జరిగిందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, బీజేడీ వ్యూహకర్త వి.కార్తికేయ పాండియన్ ఆహ్వానం మేరకు వచ్చినట్లు నటి సుప్రియ తెలిపారు. రానున్న పదేళ్ల వ్యవధిలో ఒడిశా చలన చిత్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగిందన్నారు. ఇతే తరహాలో నవీన్ నివాస్‌లో సుదీర్ఘంగా బస చేసిన ఇతర ఓలీవుడ్ ప్రముఖులు స్పందించారు. మొత్తం మీద వీరితో ఎటువంటి రాజకీయపరమైన చర్చ సాగలేదని స్పష్టం చేశారు.



ముఖ్యమంత్రి పిలుపు మేరకు హాజరైన ప్రముఖ సినీ తారలు

పార్టీలో చేరికలనే..

సార్వత్రిక ఎన్నికల నామినేషను దగ్గర పడుతున్నా టికెట్ ప్రకటన రాకపోవడంతో ఆశావాదుల్లో మాత్రం ఓలీవుడ్ తారలు హఠాత్తుగా ముఖ్యమంత్రి నివాసానికి రావడంతో వారు అధికార పార్టీలో చేరవచ్చనే ఊహాగానాల్ని రేకెత్తించింది. ప్రముఖ తారలు సిధాంత్ మహాపాత్రా, అనుభవ్ మహంతి, అరిందమ్ రాయ్, ఆకాష్ దాస్ నాయక్ ఇటీవల బిజూ జనతా దళ్‌కు గుడ్ బై పలికి భారతీయ జనతా పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా గంజాం జిల్లా దిగొపొహండి నియోజకవర్గం నుంచి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీజేపీ అభ్యర్థిగా సిధాంత్ మహాపాత్రా బరిలో ఉన్నారు. ఒడియా భాష, సంస్కృతి పట్ల బీజేడీ ప్రభుత్వ తీరు పట్ల సిధాంత మహాపాత్రో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి రానున్న ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా సంధించేందుకు సన్నద్ధత ప్రకటించారు.

● తెలుగు వెలుగుల లోగో

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అత్యధిక శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యం తీసుకొచ్చేందుకు రూపొందించిన ఎన్నికల ప్రత్యేక లోగోలను కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈసారి అత్యధికంగా 85 శాతం పైబడి ఓటింగ్ జరగాలన్న ఉద్దేశంతో ప్రచార అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా డొంగిరియా కొందొలు వినియోగించే ఇడితాల్ చిత్రాలు, అధిక శాతం మంది తెలుగు ప్రజలు ఉన్నందున తెలుగు భాషలోనూ లోగోలను విసనకర్రలపై ముద్రించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి నిహారి రంజన్ కుహరొ, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘ మిత్రాదేవి, ఏడీఎం భాస్కర్ రైతా తదితరులు పాల్గొన్నారు.

\- రాయగడ




విసనకర్రపై తెలుగు లోగోతో కలెక్టర్



ఇడితాల్ చిత్రాల లోగో విడుదల చేస్తున్న అధికారులు

వడగాలులు వచ్చేస్తున్నాయ్!

- జాగ్రత్తలపై మార్గదర్శకాలు జారీ చేసిన ఎస్ఆర్‌సీ



భువనేశ్వర్: రాష్ట్రంలో ఎండ తీవ్రత అధికమయ్యే అవకాశం పొంచి ఉంది. ఈ పరిస్థితుల్లో వడ దెబ్బ ముప్పు నియంత్రణ పట్ల జిల్లా యంత్రాంగాలకు ప్రత్యేక సహాయ కమిషనర్ ఎస్ఆర్‌సీ ప్రజలను అప్రమత్తం చేసింది. ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో వడగాడ్పుల తీవ్రత పెరుగుతుందని భారత వాతావరణ శాఖ ఐఎండీ ముందస్తు సమాచారం జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక సహాయ కమిషనర్ జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు.

- ఐఎండీ విడుదల చేసిన ప్రత్యేక సమాచారం ప్రకారం రాష్ట్రంలో వేడి, తేమతో కూడిన అసౌకర్య వాతావరణ పరిస్థితులు నెలకొని వడగాలులు వీస్తాయి. వాయవ్య, పశ్చిమ దిశల నుంచి పొడి గాలి కారణంగా పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రత చాలా చోట్ల 40 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉంటుంది. ఈ నెల 15 నుంచి కొన్ని జిల్లాల్లో సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీలు సెల్సియస్ వేడి అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఐఎండీ పసుపు హెచ్చరిక జారీ చేసింది.
- వడదెబ్బ విపత్తు నిర్వహణ దృష్ట్యా కలెక్టర్లు చేపట్టాల్సిన కార్యాచరణతో ఎస్ఆర్‌సీ లేఖ జారీ చేసింది.

వడగాలులు, ఎండ తీవ్రత హెచ్చరిక సందేశం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. శిశువులు, వృద్ధులు, అనారోగ్య పీడితులు బయటకు రాకుండా చూడాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు వెళ్లేటపుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

వడదెబ్బ బాధిత పోలీసులకు 'బీఎస్‌కేవై'

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది ఆరోగ్యం పట్ల ఆరోగ్య శాఖ స్పందించింది. పోలింగ్ విధుల నిర్వహణలో ఉంటూ వడదెబ్బకు గురైన వారికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన (బీఎస్‌కేవై) ఎంప్యానెల్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత ఆరోగ్య, చికిత్స సేవలు కల్పిస్తాయి. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రముఖ కార్యదర్శి షాలిని పండిత్ జిల్లా కలెక్టర్లకు, బీఎస్‌కేవై అనుబంధ ఆస్పత్రి యాజమాన్య వర్గాలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సౌలభ్యం పొందేందుకు సంబంధిత పోలింగు సిబ్బంది తమకు జారీ చేసిన నియామక పత్రం గానీ, ఎన్నికల విధుల సంబంధిత ఉత్తర్వు కాపీని గానీ ఆస్పత్రి వర్గాలకు దాఖలు చేయాల్సి ఉంటుంది. వీరికి తక్షణమే నగదు రహిత చికిత్స అందించాలని ఆరోగ్య శాఖ ఆదేశించింది. సంబంధిత ఖర్చుల కోసం స్టేట్ హెల్త్ అస్యూరెన్స్ సొసైటీకి బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన ప్యాకేజీ ధరల ప్రకారం బిల్లును ఆఫ్‌లైన్‌లో దాఖలు చేయాలని లేఖలో పేర్కొన్నారు.

అసంతృప్త నాయకులకు బుజ్జగింపులు


రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్‌ను ఆశించి భంగపడ్డ అసంతృప్త నాయకులతో ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్ర దాల్వి మంతనాలు జరిపారు. జిల్లాలోని గుణుపూర్, బిసంకటక్ శాసనసభల నుంచి కాంగ్రెస్ టికెట్‌ను ఆశించిన భాస్కర జగరంగ, నీలమాధవ ఉలకలతో శనివారం ఓ హోటల్లో భేటీ అయ్యారు. అధిష్టానం టికెట్ కేటాయించిన వారికే తప్పనిసరిగా మద్దతు పలికి వారి విజయానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండే బిసంకటక్, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గాలు గత రెండు దశాబ్దాలుగా అపజయమే ఎదురవుతోందని, ఈసారి ఎలగైనా విజయం సాధించాలని, ఇందుకు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని బుజ్జగించే ప్రయత్నం చేశారు. మీ అభిమతాలు, అభిప్రాయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు బిజయ్‌కుమార్ గొమాంగో, సాధారణ కార్యదర్శి శంకర్షణ్ మంగరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ పండా తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ భవన్‌లో అసంతృప్త కార్యకర్తలతో దాల్వీ సమావేశమయ్యారు.



నీలమాధవ్ ఉలక, భాస్కర జగరంగలతో మాట్లాడుతున్న దాల్వి

అగమ్యగోచరంలో తెలుగు విద్యార్థులు

- ఉపాధ్యాయుల కొరత పేరిట ప్రవేశాలకు తిరస్కరణ
- ఆందోళనలో తల్లిదండ్రులు



గొపబంధు మున్సిపాలిటీ ఉన్నత పాఠశాల



ప్రవేశాల కోసం వచ్చిన 6వ తరగతి తెలుగు విద్యార్థులు

రాయగడ: జిల్లాలో తెలుగు విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారుతోంది. ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రవేశాలు లేవని ఉపాధ్యాయులు తిరిగి పంపిస్తున్నారు. ఈ ఘటన తాజాగా పట్టణంలోని గొపబంధు మున్సిపాలిటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు వచ్చిన తెలుగు విద్యార్థులకు నిరాశ ఎదురైంది. తెలుగు మాధ్యమంలో ప్రవేశాలు కల్పించడం లేదని హెచ్ఎం నిహారిక బిడిక తెలియజేయడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న పలువురు పాత్రికేయులు పాఠశాలకు వెళ్లి హెచ్ఎంతో మాట్లాడారు. 1972లో తెలుగు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ పాఠశాల ఏర్పాటైందని, ఇప్పుడెందుకు విద్యార్థులను ఎందుకు చేర్చుకోవడం లేదని ప్రశ్నించగా ఉపాధ్యాయులు లేరని ఆమె సమాధానం ఇచ్చారు. ఈ విషయమై ప్రభుత్వ ఆదేశాలు లేవని, కేవలం ఉపాధ్యాయుల కొరత కారణంగానే అడ్మిషన్లు ఇవ్వడం లేదని, ఒకవేళ చేర్పించుకున్నా విద్యార్థులు ఇబ్బందులు పడతారనే ఉద్దేశంతో దరఖాస్తులు స్వీకరించడం లేదని బిడిక స్పష్టం చేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ఆరుగురు, 7వ తరగతిలో 12 మంది, 8వ తరగతిలో 15 మంది, 9వ తరగతిలో 35 మంది, 10వ తరగతిలో 25 మంది విద్యార్థులు ఉండేవారని, వారికి నలుగురు ప్రాథమిక ఉపాధ్యాయులు తెలుగు బోధించేవారని తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు తీసుకుంటే ప్రవేశాలు చేపడతామని హామీ ఇచ్చారు. సమస్యను జిల్లా విద్యాశాఖ అధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. అయినప్పటికీ సోమవారం నుంచి యథావిధిగా ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.

క్లుప్తంగా

బీజేడీలో పలువురి చేరిక

రాయగడ: భారతీయ జనతా పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు బీజేడీలో చేరారు. జిల్లాలోని గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం పరిధిలో పద్మపూర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది సరోజ్‌కుమార్ పాణిగ్రహి, దిలీప్ మహాపాత్రో, రాజీవ్‌లోచన్ పాఢి, రఘునందన్ పాఢి, సత్యనారాయణ పాఢిలతో పాటు వారి మద్దతుదారులు శనివారం బీజేడీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేడీ రాష్ట్ర శాఖ సాధారణ కార్యదర్శి సుధీర్‌దాస్, రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక సమక్షంలో వీరంతా బీజేడీ కండువాలు ధరించారు. ఈ సందర్భంగా మంత్రి సరక మాట్లాడుతూ తాజా చేరికలతో పార్టీ మరింత బలపడి గుణుపూర్ అభ్యర్థి రఘునాథ్ గొమంగొ (బీజేడీ) విజయం సులభతరమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సరిహద్దులో తనిఖీలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఎస్పీ స్వాతికుమార్ ఆదేశాల మేరకు కాశీనగర్‌లో ఐఐసీ గోవింద గౌడ ఆధ్వర్యంలో ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా డబ్బు, మద్యం రవాణా అరికట్టేందుకు కాశీనగర్ బ్లాక్ కె.సీతాపురం నాలుగో పాయింట్ వద్ద వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న పలువురికి జరిమానాలు విధించారు.

కాత్యాయని స్వరూపిణిగా జగులై మాత


జగులై మాత

భువనేశ్వర్: వసంత నవ రాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఖుర్దారోడ్ కుదియారి గ్రామ దేవత జగులై మాత రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. షష్టి తిథి పురస్కరించుకుని శనివారం కాత్యాయని అలంకరణలో భక్తులకు మాత దర్శనం లభించింది. ఉత్సవ ప్రత్యేక పూజల్లో భాగంగా దేవికి నిత్యం సంధ్య వేళలో మహాభిషేకం నిర్వహిస్తున్నారు. నిత్యం షోడశోపచార పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకుడు మనోరంజన్ పండా తెలిపారు.

శాశ్వత అన్నదానానికి రూ. లక్ష విరాళం


సీతారామారావు ఇంటిలోనే విరాళ చెక్కును స్వీకరిస్తున్న ఈఓ చంద్రశేఖర్

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు నగరానికి చెందిన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుంటూరి సీతారామారావు, ఉషాదేవి దంపతులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. తన తల్లితండ్రులు డాక్టర్ గుంటూరి రెడ్డయ్య,సుబ్బమ్మల జ్ఞాపకార్థం ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్‌కు విరాళ చెక్కును దాతలు అందజేశారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో నివాసముంటున్న వృద్ధులైన సీతారామారావు(93) ఇంటికే నేరుగా వెళ్లి విరాళ చెక్కును ఆలయ ఈఓ చంద్రశేఖర్ స్వీకరించారు. ఆలయానికి రాలేకపోయిన దాతలను గౌరవిస్తూనే విరాళాన్ని స్వీకరించేలా చర్యలు చేపట్టేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఈఓ ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు లుకలాపు గోవిందరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తి తదితరులున్నారు.

'భద్రాచలం ప్రత్యేక బస్సు సద్వినియోగం చేసుకోండి'

శ్రీకాకుళం అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ భద్రాచలంకు ప్రత్యేక బస్సు వేసిందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో శనివారం భద్రాచలం ప్రత్యేక బస్సుల బ్యానర్‌ను ఆర్టీసీ ఒకటో డిపో మేనేజర్ మల్లికార్జునరాజు, ఆర్టీసీ అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరాజు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి భద్రాచలంకు మొట్ట మొదటిసారిగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ప్రయాణ చార్జీ సాధారణ చార్జీలేనని, పెద్దలకు ఒక్కొక్కరికి రూ.940, చిన్నారులకు రూ.570గా నిర్ణయించారు. ప్రయాణికులు తమ టికెట్‌లను ముందుగానే రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. భద్రాచలంనకు వెళ్లే భక్తులు తమ టికెట్‌లు, ఇతర వివరాలకు 7382921647, 7382919694 నంబర్లకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జోరుగా.. హుషారుగా..!

- ఊపందుకున్న ప్రచారాలు
- హామీల వర్షం కురిపిస్తున్న అభ్యర్థులు
- తమనే గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి


బరంపురం: ఎన్నికల ప్రచారంలో బీజేడీ అభ్యర్థి రమేష్‌చావ్ పట్నాయక్


మల్కన్‌గిరి: కూర్మానూర్ పంచాయతీలో కాంగ్రెస్ నేతల ప్రచారం

మల్కన్‌గిరి : పోలింగ్ సమీపిస్తుండటంతో అభ్యర్థులు ప్రచారాల జోరు పెంచారు. గెలుపే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. తమనే గెలిపించాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో హామీల వర్షం కురిపిస్తున్నారు. మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కూర్మనూర్ పంచాయతీ ఒకప్పుడు మావోయిస్టుల ప్రభావంతో దద్దరిల్లేది. బీఎస్ఎఫ్ జవాన్ల రాకతో ప్రస్తుతం మావోయిస్టుల ప్రాబల్యం తగ్గడంతో రాజకీయ నాయకుల రాక పెరిగింది. ఇక్కడ ఎన్నికల ప్రచారాలు సైతం జోరుగా సాగుతున్నాయి. శనివారం మల్కన్‌గిరి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మలమాడీ, చిత్రకొండ నియోజకవర్గ అభ్యర్థి మంగు ఖీలో, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవిందో పాత్రో కలసి ప్రచారం నిర్వహించారు. మావోయిస్టులకు భయపడకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తాగునీరు, విద్యుత్, పాఠశాల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.


జయపురం: ఎమ్మెల్యే అభ్యర్థి బాహిణీపతికి స్వాగతం చెబుతున్న ఆదివాసీ మహిళలు

బరంపురంలో..

బరంపురం : నగరంలో ఎన్నికల వేడి రాజుకుంది. బరంపురం శాసనసభ నియోజకవర్గంలో శనివారం బీజేడీ అభ్యర్థి రమేష్‌చావ్ పట్నాయక్, బీజేపీ అభ్యర్థి కె.అనిల్‌కుమార్ పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి వార్డుల్లో కలియతిరుగుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

జయపురంలో..

జయపురం: ఎమ్మెల్యే అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. కార్యకర్తలతో సమావేశమవుతూ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. వెళ్లిన ప్రతిచోటా అపూర్వ ఆదరణ లభిస్తుండటంతో ఉత్సాహంగా ప్రచారం కొనసాగిస్తున్నారు.

మే 10 నుంచి ధను జాతర


వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

భువనేశ్వర్: ధను జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. వచ్చే నెల 10 నుంచి 17 వరకు ఉత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకవర్గం ప్రకటించింది. అక్షయ తృతీయ పురస్కరించుకుని ఏటా ఈ మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా జట్నీ పాత్రొపాడా గ్రామం మదన మోహన దేవుని ప్రతిష్ఠ సహిత 35వ శ్రీకృష్ణ రాసలీల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పాత్రొపాడా బహిరంగ స్థలంలో సువిశాల ప్రాంగణంలో ఉత్సవ నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పలు రంగాల్లో పేరొందిన ప్రముఖులకు ప్రత్యేకంగా సత్కరిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు సాహితీ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ధార్మిక, మనోరంజక కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహక వర్గం అధ్యక్షుడు మన్మోహన్ రౌత్రాయ్ శనివారం తెలిపారు. బాలల్ని ఆకట్టుకునేందుకు మహోత్సవ ప్రాంగణంలో ఇంద్రజాలం, సర్కస్, బాణసంచా కాల్చడం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయాన్ని ప్రారంభించిన ఎస్‌డీపీఓ అంకితకుమార్ వర్మ

జయపురం: స్థానిక బక్షీసాహి కూడలి వద్ద త్రినాథ్ సేవా పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నపూర్ణ గ్రంథాలయాన్ని జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకితకుమార్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేసిన త్రినాథ్ సేవా పరిషత్ నిర్వాహకులను అభినందించారు. త్రినాథ్ సేవా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ పరేష్ రథ్ మాట్లాడుతూ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి లక్ష్మీకాంత మిశ్రా, ఉపాధ్యక్షుడు కనుచరణ గంతాయిత్, డాక్టర్ సురేష్‌దాస్ పాల్గొన్నారు.

అనర్హత వేటుపై కోర్టుకు..

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ సభ్యునిగా ఉన్న తనపై అనర్హత వేటు వేయడం అన్యాయమని, ఈ చర్యని సవాలు చేస్తూ రాష్ట్ర హైకోర్టుని ఆశ్రయిస్తానని సీనియర్ నేత అరబింద ఢాలీ ప్రకటించారు. ఇదో కక్ష సాధింపు చర్యగా పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ ఆదేశాలను సవాలు చేసేందుకు న్యాయపరమైన సలహాలు తీసుకుంటానని తెలిపారు. ఈ మేరకు శనివారం నగరంలో బీజేపీ కార్యక్రమంలో విలేకరులతో మాట్లాడారు. జయదేవ్ శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్న అరబింద ఢాలీ మూడు రోజుల క్రితం అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) నుంచి వైదొలిగి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరిన తరువాత ఎమ్మెల్యేగా అనర్హత వేటు పడిన విషయం తెలిసిందే. వచ్చే ఎన్నికల్లో జయదేవ్ అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఖరారయ్యారు. ఈ క్రమంలోతన అసెంబ్లీ సభ్యత్వాన్ని ఉద్దేశపూర్వకంగా రద్దు చేశారని, కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని ఢాలీ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేడీని వీడి బీజేపీలో చేరిన వారు మాత్రమే ఎమ్మెల్యేలుగా అనర్హులుగా ప్రకటించారని, అదే నిబంధనను ఇతరులకు వర్తింపజేయలేదని పేర్కొన్నారు.

విదేశీ మద్యం పట్టివేత


నిందితుడు, మద్యం బాటిళ్లతో పోలీసు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి పోలీసులు శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ ఇంటి వద్ద విదేశీ మద్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కర్తన్‌పల్లి పంచాయతీ బరా గ్రామంలో కాల్యడ్ అనే వ్యక్తి ఇంటి వద్ద 74 లీటర్ల మద్యం బాటిళ్లను గుర్తించారు. వెంటనే స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితుడ్ని సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

కార్మికులకు న్యాయవాదుల సంఘీభావం



దీక్షలకు సంఘీభావం తెలిపిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

జయపురం: సమస్యల పరిష్కారం కోరుతూ గగణాపూర్ సేవా పేపరు మిల్లు ప్రధాన గేటు ఎదుట ధర్నా చేపడుతున్న కార్మికులకు న్యాయవాదులు మద్దతు పలికారు. జయపురం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు కలిసి మాట్లాడారు. బకాయిలు చెల్లించడంలో యాజమాన్యం అవలంబిస్తున్న వైఖరిని విమర్శించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు మున్నాలాల్ సింగ్, మాజీ అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పి.రమేష్ పాత్రో, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్, కార్మిక నేత ప్రమోద్‌కుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల నిర్బంధం

- పిల్లలను ఎత్తుకెళ్లే దొంగలుగా భావించి స్తంభానికి కట్టేసిన గ్రామస్తులు


సాగర్ పాత్రో



సుఖదేవ్ జానీ

జయపురం : గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను స్థానికులు నిర్బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని విడిపించి స్టేషన్‌కు తరలించారు. వీరిద్దరూ ఇదే గ్రామంలో జరిగిన చోరీ కేసులో నిందితుడిగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసు అధికారి రశ్మీరంజన్ దొలాయి వివరాలు వెల్లడించారు. ఫవర్ హౌస్ కాలనీ సమీపంలోని వికాశనగర్‌లో శుక్రవారం రాత్రి ఉమ్మరి గ్రామానికి చెందిన సాగర్ పాత్రో అనుమానాస్పదంగా తిరుగుతుండగా యువకులు పట్టుకున్నారు. వెంటనే విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి యువకుడ్ని విడిపించారు. అనంతరం గ్రామ పరిసరాల్లో గాలించగా దులాగుడ గ్రామానికి చెందిన సుఖ్‌దేవ్ జానీని పట్టుకున్నారు. వీరిద్దరినీ స్టేషన్‌కు తరలించి విచారించగా సాగర్ పలు కేసుల్లో నిందితుడిగా గుర్తించారు. జనవరిలో హరిజన వీధిలోని ప్రాథమిక విద్యాలయ తాళాలు విరగ్గొట్టి బియ్యం, డ్రమ్ము, వంట సామాగ్రి దొంగిలించిన కేసులో వీరిద్దరూ నిందితులుగా గుర్తించారు. అనంతరం వీరిపై కేసు నమోదు చేశారు. దొంగలు చాకచక్యంగా పట్టుకున్న వికాశనగర్ యువకులను పోలీసులు ప్రశంసించారు.

మైక్రో అబ్జర్వర్లకు దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. సూక్ష్మ పరిశీలకులకు అంబేడ్కర్ ఆడిటోరియంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ విధానాన్ని పరిశీలిస్తూ ఎలాంటి తప్పిదాలు, ఉల్లంఘనలు జరిగినా రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పోలింగ్‌కు గంట ముందు మాక్ పోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ స్టేషన్లు పరిశీలించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రవేశపెట్టిన హోం ఓటింగ్‌ను వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఏప్రిల్ 18 నుంచి 23 వరకు ఇందుకు సంబంధించిన ఫారం–12డి దరఖాస్తులను సంబంధిత సిబ్బంది సేకరిస్తారని, దాని ఆధారంగా పోస్టల్ బ్యాలెట్ మాదిరిగా హోం ఓటింగ్ అవకాశాన్ని కల్పించాలన్నారు. ఈ హోం ఓటింగ్ ఎలా నిర్వహించాలో అవగాహన కల్పించారు.

9 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదల

భువనేశ్వర్: రాష్ట్రంలో తొమ్మిది లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పేర్లను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) శనివారం ప్రకటించింది. కెంజొహర్(ఎస్టీ)– మోహన్ హేంబ్రమ్, బాలాసోర్– శ్రీకాంత్ కుమార్ జెనా, భద్రక్ (ఎస్సీ) – అనంత్ ప్రసాద్ సెఠి, జాజ్‌పూర్ (ఎస్సీ)– ఆంచల్ దాస్, ఢెంకనాల్ – సస్మితా బెహెరా, కేంద్రాపడా – సిద్ధార్థ్ స్వరూప్ దాస్, జగత్‌సింగ్‌పూర్ (ఎస్సీ) – రవీంద్ర కుమార్ సెఠి, పూరీ – సుచరిత మహంతి, భువనేశ్వర్ – యాసిర్ నవాజ్ పోటీ చేయనున్నారు.

నొలొబొనొ ద్వీపంలో చెలరేగిన మంటలు


ద్వీపంలో చెలరేగిన మంటలు

భువనేశ్వర్ : చిలికా సరస్సులో నొలొబొనొ ద్వీపంలోని పక్షుల అభయారణ్యంలో శనివారం భారీస్థాయిలో మంటలు చెలరేగాయి. ఎండతీవ్రత ధాటికి కలుపడా ఘాట్ జెట్టీ సమీపంలో ఈ మంటలు చెలరేగినట్లు గుర్తించారు. ఈ ఘటనలో అనేక ఫిషింగ్ క్యాట్స్, పక్షులు చనిపోయాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఉదయం 10 గంటల ప్రాంతంలో మంటలు ఆరంభమైనట్లు స్థానికుల కథనం. సమాచారం అందడంతో చిలికా అటవీ శాఖ వన్యప్రాణుల విభాగం అధికారి అమ్లాన్ నాయక్ స్థానికుల సహకారంతో పడవలో ఘటనా స్థలానికి చేరువగా వెళ్లి పరిస్థితిని క్షుణ్ణంగా సమీక్షించారు. ఆయన సమాచారం ప్రకారం ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ హాని జరగనట్లు తెలిసింది. మంటల వ్యాప్తికి కారణాలు తెలియాల్సి ఉంది.

హోమ్ ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి

పార్వతీపురం టౌన్: హోం ఓటింగ్‌కు సంబంధించి పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో కొంతమంది బీఎల్‌ఓలు వృద్ధులు, దివ్యాంగుల వద్ద సరిగ్గా విల్లింగ్ తీసుకోవడం లేదని పలువురు వృద్ధులు అంటున్నారు. నియోజకవర్గంలో 80 ఏళ్లు దాటిన వారు 873 మంది, దివ్యాంగులు 3480మంది వరకూ ఉన్నారు. వీరందరికీ ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఈ విషయమై ఆర్డీఓ కార్యాలయ ఏఓను వివరణ కోరగా హోమ్ ఓటింగ్‌కి సంబంధించి గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు ఫారం–12డీపై అవగాహన కల్పిస్తూ వారి నుంచి హోమ్ ఓటింగ్ లేక, పోలింగ్ బూత్ వద్ద ఓటింగ్ అంశంపై విల్లింగ్ తీసుకుంటున్నట్లు తెలిపారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి ఎంతమంది వినియోగించుకుంటున్నారని ఈ నెల 25న తెలియజేస్తామన్నారు.

తప్పిన ముప్పు


పెద్దబాణాపురం సమీపంలో బోల్తాపడిన కారు

నందిగాం: మండలంలోని పెద్దబాణాపురం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కారు బోల్తా పడిన సమయంలో కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారని, కానీ వారికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

యువత సన్మార్గంలో నడవాలి


విద్యార్థులతో అధ్యాపకులు

బరంపురం : యువత సన్మార్గంలో నడవాలని, సీనియర్ స్టూడెంట్లు జూనియర్లకు మార్గదర్శకంగా నిలవాలని బినాయక ఆచార్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలా ఖడంగా పిలుపునిచ్చారు. శనివారం అస్కా రోడ్డులోని కాలేజీ ప్రాంగణంలో +3 డిగ్రీ ఫైనలియర్ విద్యార్థుల ఫేర్‌వెల్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, హెచ్ఓడీ కమలకాంత్, అధ్యాపకులు శంకర్ మహాపాత్రో, మధుమిత నాయక్, కలిపాద ముండా తదితరులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై ఓటరు ఆసక్తి

సాలూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటరు తమ ఓటు వినియోగంపై ఆసక్తి కనబరుస్తున్నాడని ఐటీడీఏ పీఓ, సాలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ శనివారం చెప్పారు. కొటియా గ్రామాల ప్రజల తమ ఓటును వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై ఇప్పటికే మాక్ పోలింగ్ డ్రైవ్ ద్వారా అవగాహన కల్పించామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే 125 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ అవసరమని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. సాలూరు నియోజకవర్గంలో 243 పోలింగ్ కేంద్రాల్లో 32 మంది సెక్టార్ అధికారులు, 25 మంది రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు.

రేకుల షెడ్‌పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

కొత్తూరు: మామిడి పండ్ల కోసం రేకుల షెడ్ ఎక్కిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. కొత్తూరు మండలంలోని గూనభద్ర ఆర్ఆర్ కాలనీ వద్ద శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు చెప్పి న వివరాలు ప్రకారం .. మండలంలోని గూనభద్ర అపోజిట్ ఆర్ఆర్ కాలనీకి చెందిన మీసా ల మిన్నారావు(35) మామిడి పండ్ల కోసం గూనభద్ర ఆర్ఆర్ కాలనీలోని విశాఖ పాలకేంద్రానికి ఎదురుగా ఉన్న అలికాం బత్తిలి రోడ్డుకు ఆనుకొని ఉన్న మామిడి చెట్టు వద్దకు శనివారం వేకువజామున చేరుకున్నాడు. మామిడి చెట్టు కిందన ఉన్న రేకులు షెడ్‌పైన కొన్ని పండ్లు పడి ఉండగా.. వాటిని తీసేందుకు మిన్నారావు రేకుల షెడ్ ఎక్కాడు. అయి తే షెడ్‌పై నుంచి అమాంతం జారిపడడంతో మృతి చెందాడు. స్థానికులు మిన్నారావు కు టుంబ సభ్యులకు సమాచారం అందజేయడంతో భార్య రమ్యతో పాటు కుటుంబ సభ్యులు సంఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. మిన్నారావుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈయన తాపీపని పనిచేసుకుంటూ బతుకుతున్నారు. మిన్నారావు మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ బి.కోటేశ్వరరావు తెలిపారు. ఫిర్యాదు మేరకు స్థానిక సీఐ ఆర్.వేణుగోపాలరావు సంఘటన స్థలం వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విస్తృతంగా తనిఖీలు


వాహన తనిఖీలు చేపడుతున్న ఫ్లైయింగ్ స్క్వాడ్

పార్వతీపురం టౌన్: రానున్న సాధారణ ఎన్నికలు నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వాహనాల తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. శనివారం పట్టణంలోని రాష్ట్ర రహదారిపై వైకేఎం కాలనీ, పాత బస్టాండ్, రైల్వేస్టేషన్ జంక్షన్లలో వాహనాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికార సిబ్బంది, ఎస్ఐ సంతోషి మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వాహనాల్లో అనుమతులు లేకుండా నగదు తరలించరాదని, నిషేధిత సరుకులు తరలించడం నేరమన్నారు. వాహనాల తనిఖీల్లో నగదు నిషేధిత సరుకులు పట్టుబడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే రోజుకు మూడు షిఫ్ట్‌లతో 24 గంటలు వాహనాలు తనిఖీలు చేయడం జరుగుతుందని తెలిపారు. వాహనాలు తనిఖీ చేసే అధికారులకు వాహన చోదకులు సహకరించాలని కోరారు.


కారు డిక్కీలోని బ్యాగ్‌ల్లో సోదాలు చేస్తున్న ఎఫ్ఎస్‌టీ అధికారి చిన్నారావు

ముమ్మరంగా వాహన తనిఖీలు

సీతానగరం: మండలంలోని సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేస్తామని ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం అధికారి కె.చిన్నారావు తెలిపారు. శనివారం రాష్ట్ర రహదారిలో లచ్చయ్యపేట, అంటిపేట, చినబోగిలి, కాశీపేట, గుచ్చిమి, నూరంపేట జంక్షన్లలో పోలీసుల సహకారంతో వాహనాలను తనిఖీ చేసారు. మే నెల 13 సాధారణ ఎన్నికలు నిర్వహించినంత వరకూ వాహనాలు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాహన యజమానులు లిఖిత పూర్వకంగా నిర్ధారించుకున్న నగదు లేదా సరుకులు మాత్రమే తరలించాలని లేని పక్షంలో ఎన్నికల నిబంధనల అనుసరించి చర్యలు తప్పవని అన్నారు. తనిఖీల సమయంలో వాహన యజమానులు పోలీసులకు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

25 కేజీల వెండి వస్తువుల పట్టివేత



స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులను పరిశీలిస్తున్న సీఐ మోహనరావు తదితరులు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి ఎన్నికల చెక్ పోస్టు వద్ద 25 కేజీల వెండి వస్తువులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నామని రాజాం టౌన్ సీఐ డి.మోహనరావు తెలిపారు. శనివారం విశాఖపట్నం నుంచి పాలకొండ వెళ్తున్న బస్సులో తనిఖీలు చేపట్టగా రెండు బ్యాగుల్లో వెండి వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. సుమారు రూ.20 లక్షల విలువైన 25 కేజీల వెండికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశామని తెలిపారు. వెండి వస్తువులతో పాటు వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించామని తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ వై.రవికిరణ్, ఏఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురి అరెస్టు

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లికి చెందిన మంతెన సింహాచలం 12 మద్యం బాటిళ్లు, పాత బొబ్బిలికి చెందిన గుణుపూరు అప్పలనాయుడు 20 మద్యం సీసాలు, అదే గ్రామానికి చెందిన చింతల సత్యనారాయణ 10 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకుని మద్యం సీసాలను సీజ్ చేసినట్టు సీఐ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సీసాలను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడుల్లో సిబ్బంది భాస్కరరావు, రమణలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈ కిశోర్‌కుమార్ ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. విద్యుత్ లైన్లు, స్తంభాల వద్ద ఉన్న ముళ్లపొదలు, తుప్పలు తొలగిస్తున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట

గరుగుబిల్లి: మండలంలోని సీతారాంపురం రామాలయంలో సీతారామలక్ష్మణుల విగ్రహాలతో పాటు ఆంజనేయస్వామి విగ్రహాన్ని శనివారం పునఃప్రతిష్టించారు. పురోహితులు కె.మురళీమోహన్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం పూజలు, ప్రత్యేక అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆల య ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

జియ్యమ్మవలస: వేసవి ఎండల నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని బాసంగి పంచాయతీ పరిధిలోని ఎం.హరిపురం గ్రామంలో పాడైన తాగునీటి బోర్లను యుద్ధప్రాతిపదికన శనివారం బాగుచేశారు. ప్రస్తుతం అన్నిచోట్ల తాగునీరు పుష్కలంగా లభిస్తుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డీఐవో పరిశీలన

కురుపాం: మండలంలోని మొండెంఖల్ పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ని పార్వతీపురం మన్యం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐవో) మూటక నారాయణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, వైద్యుల పనితీరు, రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలు, వాటి కాల పరిమితిని పరిశీలించారు. రోగులకు నిరంతరం అందుబాటులో ఉండి, వారికి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని సూచించారు.

ప్రముఖ రంగస్థల నటుడు మృతి

గరుగుబిల్లి: ప్రముఖ రంగస్థల నటుడు ఎన్ని సంగమేశ్వరరావు(75) శనివారం ఉదయం కన్నుమూశారు. మండలంలో ని చినగుడబ గ్రామానికి చెందిన ఆయన స్వగృహంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల కళాకారులు, సాహిత్యకారులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. సంగమేశ్వరరావు మృతి కళారంగానికి తీరని లోటు అని కొనియాడారు. తొలినాళ్లలో హార్మోనియం వాయిద్యకారుడిగా సుపరిచితుడైన ఆయన ఆ తర్వాత రంగస్థలంపై కృష్ణుడు, నక్షత్రకుడి పాత్రలు వేసి, అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్ర దేశ్‌లో వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఘనంగా ఉత్సవ విగ్రహాల తిరువీధి

భామిని: మండలంలో చిన్నదిమిలి గ్రామంలో నూతనంగా నిర్మించిన రఘురామాలయం ప్రతిష్టోత్సవాల్లో భాగంగా శనివారం ఉత్సవ విగ్రహాల తిరువీధి వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, భజనలు, మహిళల కోలాటం మధ్య మహిళలు ఘటాలతో తిరువీధిలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తిరువీధి అనంతరం దేవతామూర్తుల విగ్రహాలకు జలాదివాసం, యాగశాలలో హోమాదికారులు నిర్వహించారు. భక్తుల శ్రీరామ జపంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

రేపటి నుంచి వేటకు విరామం

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	ఆర్థిక లబ్ధి
2019-20	2,645	26.45 (కోట్లు)
2020-21	2,772	27.72
2021-22	2,335	23.35
2022-23	2,944	29.44
2023-24	3,522	35.22

- ఏప్రిల్ 15 నుంచి జూన్ 16 వరకు వేట నిషేధం
- మత్స్య సంపద వృద్ధికి నిషేధాజ్ఞలు
- మత్స్యకారులకు ఠంచన్‌గా భృతి చెల్లిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం



పూసపాటిరేగ: తిప్పలవలస తీరం ఒడ్డున నిలిపిన పడవలు

పూసపాటిరేగ/భోగాపురం: సాగరంలో మత్స్య సంపద వృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏటా మత్స్యసంపద వృద్ధి అయ్యే సమయం ఏప్రిల్ 15 నుంచి జూన్ 16వ తేదీ వరకు వేట నిషేధాజ్ఞలు జారీ చేసింది. 61 రోజుల పాటు నిషేధం అమలులో ఉంటుంది. ఈ సమయంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం మత్స్యకార భృతి కింద ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున చెల్లిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం కేవలం రూ. 4వేలు మాత్రమే ఇచ్చేది. అది కూడా లబ్ధిదారులందరికీ సక్రమంగా అందేది కాదు. జన్మభూమికమిటీలు సూచించిన వారికే మంజూరయ్యేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లుగా ఠంచన్‌గా వేటసాగించే ప్రతి మత్స్యకార కుటుంబ పెద్ద ఖాతాకు భృతి ఠంచన్‌గా జమచేస్తోంది.

ఇదీ పరిస్థితి

జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలో మీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. సముద్రతీరం వెంబడి 19 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. 21 వేల మంది చేపలవేటపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలో 584 సాంకేతిక బోట్లు, 274 సంప్రదాయ బోట్లులో మత్స్యకారులు వేట సాగిస్తున్నారు. వేటపైనే ఆధారపడి జీవిస్తున్న 21 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు మత్స్యకారులకు ప్రభుత్వం భృతి చెల్లిస్తోంది.

మత్స్యకారులకు భరోసా



వేట నిషేధ సమయంలో మత్స్యకారులను ఆదుకునేందుకు మత్స్యకార భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేలు సాయం అందజేస్తోంది. జిల్లాలో గత సంవత్సరం ఈ పథకం కింద 3,522 మందికి లబ్ధి చేకూరింది. ఈ సంవత్సరం 5,000 మందికి మత్స్యభరోసా అందనుంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు పనులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

– మైలపల్లి నరసింహులు, మత్స్యశాఖ కార్పొరేషన్ డైరెక్టర్

నేరుగా బ్యాంకు ఖాతాకే మత్స్యకార భరోసా



వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో వేట నిషేధ సమయంలో అర్హులందరి ఖాతాల్లోకి రూ.10వేలు చొప్పున వైఎస్సార్ మత్స్యకార భరోసా జమవుతోంది. టీడీపీ ప్రభుత్వంలో కేవలం రూ.4వేలు ఇచ్చేవారు. అదికూడా నెలల తరబడి జాప్యం చేసి కొద్దిమందికే మంజూరుచేసేవారు. ఇప్పుడు అధికారులే మత్స్యకారుల ఇళ్లకు వెళ్లి పథకాలు మంజూరు చేస్తున్నారు.

– బర్రి చినఅప్పన్న, జిల్లామత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, విజయనగరం

విధి వంచితుడు

- ఢిల్లీలో విద్యుత్ షాక్‌తో జవాన్ మృతి
- సొంతూరు గొట్ట మంగళాపురంలో విషాదం



మృతుడు సామంతుల రాంబాబు(ఫైల్)

పాలకొండ రూరల్: విధి వంచనకు ఓ జవాన్ అసువులు బాశాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడికి ఉద్యోగం వస్తే ఆ తల్లిదండ్రులు ఎంతో సంబరపడ్డారు. ఇటీవలె ఏడు నెలల కిందట ఆ కుమారుడికి వివాహం కూడా చేశారు. ఇంతలోనే విధి కన్నెర్ర చేసింది. ఇటు తల్లిదండ్రుల ఆశలను, అటు భార్యకన్న కలలు కల్లలయ్యాయి. విద్యుత్ షాక్ రూపంలో మృత్యు ఒడిలోకి తీసుకుపోయింది. వివరాల్లోకి వెళ్తే.. పాలకొండ మండలం గొట్ట మంగళాపురం గ్రామానికి చెందిన సామంతుల రాంబాబు(31) ఎంతో కష్టపడి సెంట్రల్ ఇండస్ట్రియల్ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో కొన్నాళ్ల కిందట కొలువు సాధించాడు. విధి నిర్వహణలో భాగంగా ఢిల్లీలో పని చేస్తున్నాడు. ఇటీవల జరిగిన రంజాన్ వేడుకల్లో చోటు చేసుకున్న అపశ్రుతి కారణంగా మూడు రోజుల కిందట విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. శరీరంగా తీవ్రంగా కాలిపోయింది. ఈ క్రమంలో ఢిల్లీల్లో వైద్య సేవలు పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. రాంబాబు మృతదేహం శనివారం సంబంధిత అధికారులు స్వగ్రామానికి తీసుకువచ్చారు. రాంబాబు మృతదేహం చూసి ఇటు కుటుంబీకులు, అటు గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తల్లిదండ్రులు నారాయణరావు, విజయలక్ష్మి, భార్య జ్యోతి గుండెలవిసేలా రోదించారు. వీరి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. జ్యోతి భర్తతో పాటే ఢిల్లీలో ఉంటుంది. సీఐఎస్ఎఫ్ అధికారులు రాంబాబు మృతదేహానికి గౌరవ లాంఛనాలతో వందనం సమర్పించారు. ఈ క్రమంలో భార్య జ్యోతిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఐ జ్ఞానప్రసాద్, సిబ్బంది

రామభద్రపురం: మండలంలోని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తన సిబ్బందితో కలిసి శనివారం సారా బట్టీలపై దాడులు చేశారు. చందాపురం శివారులో 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చందాపురం పరిసరాలలో సారా తయారీ అవుతుందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. సారా తయారీ కోసం సిద్ధం చేసి ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. ఎస్పీ దీపికాపాటిల్ ఆదేశాల మేరకు సారా తయారీ బట్టీలపై విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సారా అక్రమ తయారీదారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

527 లీటర్ల సారా ధ్వంసం



సారాను ధ్వంసం చేస్తున్న పోలీసు సిబ్బంది

పార్వతీపురం టౌన్: పట్టణ పోలీసుస్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన 527 లీటర్ల సారాను పట్టణ శివారుల్లో ఏఎస్పీ సునీల్ షరైన్ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు పట్టణ సీఐ వీవీవీఎస్ఎన్ కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పట్టణంలో 8 కేసుల్లో పట్టుబడిన సారాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధ్వంసం చేశామన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో సారా రవాణా, తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అమ్మకాలు, రవాణా వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలసలో...

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామ సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న సారా తయారీ శిబిరాలపై కొత్తవలస సీఐ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. రహస్య ప్రదేశాల్లో సారా తయారీకి సిద్ధంగా వుంచి 400 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. పోలీసుల అలికిడికి సారా తయారీదారులు అక్కడ నుంచి పరారయారు. ఈ మేరకు బెల్లం ఊటను నిల్వ వుంచిన డ్రమ్ములు, పాత్రలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి: డీఎస్పీ



వీరఘట్టం: నడిమికెల్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ చంద్రమౌళి, ఎస్సై ఫక్రుద్దీన్

పాలకొండ: నియోజకవర్గ కేంద్రానికి వచ్చే రహదారుల్లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులను డీఎస్పీ కృష్ణారావు శనివారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తనిఖీలు ముమ్మరం చేసినట్లు చెప్పారు. ప్రతీ గ్రామంలో పోలీసు బలగాలు పర్యటించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రజలంతా సహకరించాలి

వీరఘట్టం: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని పాలకొండ సీఐ చంద్రమౌళి కోరారు. మండలంలోని నడిమికెల్లలో శనివారం పర్యటించారు. ఎన్నికల నియమావళిని అందరూ విధిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ ఉన్నారు.

పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలి



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

కురుపాం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ అన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని సమర్థంగా విధులు నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ నిషాంత్ కుమార్ సందర్శించారు. ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సిన ప్రవర్తనా నియమావళి, తీసుకోవలసిన జాగ్రత్తలు, విధులు నిర్వహణ తదితర అంశాలపై అందిస్తున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్ట ప్రజాస్వామ్యానికి జరుగుతున్న ఎన్నికల్లో భాగస్వామ్యం అయినందున చిత్తశుద్ధితో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని భావించి ఎటువంటి ఆరోపణలు లేకుండా స్వేచ్ఛగా ప్రశాంతంగా జరిగేలా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్ అధికారులు, సెక్టర్ అధికారులు కీలకమని అన్నారు. ఎక్కడ ఎటువంటి లోపాలు తలెత్తకుండా ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు ఏమైనా అనుమానాలు ఉంటే శిక్షణలో పూర్తి స్థాయిలో నివృత్తి చేసుకోవాలన్నారు. మాక్ పోలింగ్ మొదలుకొని స్ట్రాంగ్ రూములో ఈవీఎంలు భద్రపరిచే వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యలపై పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నడుచుకోవాలని అతిక్రమించిన, నిర్లక్ష్యం చూపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ పూర్తయిన తరువాత ప్రిసైడింగ్ అధికారి డైరీ రాయడం, ఫారం 17 సీ నింపడం వంటి చర్యలపై శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లను కలిపే కేబుల్స్ ఉపయోగించడంలో తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈవీఎంల మొరాయింపు వంటి అంశాలు ఉత్పన్నం కావని ఆయన స్పష్టం చేశారు. సెక్టార్ అధికారులు సైతం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియ పైన, ప్రిసైడింగ్ అధికారుల విధులపైన సెక్టార్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వారికి తలెత్తే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసే స్థాయిలో ఉండాలని తెలిపారు. సెక్టార్ అధికారులు ఎన్నికల కమిషన్‌కు ఫస్ట్ రెస్పాండర్‌గా ఉంటారని ఆయన తెలిపారు. అనంతరం మాక్ పోలింగ్‌ను పరిశీలించారు. పాలకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి, కురుపాం శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.వెంకటరమణ, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామనవమి వసంతోత్సవాలు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి వసంతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీమద్రామాయణ, సుందరకాండ పారాయణం చేపట్టారు. స్వామి సన్నిధిలో లక్ష తులసీ దళార్చన, కుంకుమార్చనను అర్చకులు అత్యంత వైభవోపేతంగా కొనసాగించారు. యాగశాలలో గాయత్రీ రామాయణం, సంక్షేమ రామాయణం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్తీక్‌కు 982వ ర్యాంకు

విజయనగరం రూరల్: ఇటీవల విడుదల చేసిన ఆల్ ఇండియా సైనిక పాఠశాలల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విజయనగరానికి చెందిన దేవభక్తుని లక్ష్మీసాయి కార్తీక్ 982 ర్యాంకు సాధించాడు. సైనిక పాఠశాలల్లో ప్రవేశాలకు ఫిబ్రవరిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో కార్తీక్‌కు 300 మార్కులకు 269 మార్కులు సాధించాడు. ఆల్ ఇండియా స్థాయిలో జనరల్ కేటగిరిలో 982 ర్యాంకు సాధించిన కార్తీక్‌ను తల్లిదండ్రులు శ్రీకాంత్, రజితలు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

భోగాపురం: మండల కేంద్రం భోగాపురం జాతీయ రహదారి బస్‌స్టాప్ వద్ద శ్రీసత్య సాయి సేవాసమితి జ్ఞాన మందిరం సభ్యులు శనివారం చలివేంద్రం ప్రారంభించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఏటా వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. తొలిరోజు ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు కాపుగంటి కృష్ణారావు, అట్టాడ సూర్యనారాయణ, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళశాసనం, శాత్తుముర్రై, తీర్థఘోష్టి, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

చోరీ సొత్తు స్వాధీనం

- ఇద్దరు మహిళల అరెస్ట్



రికవరీ చేసిన వస్తువులను చూపిస్తూ వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: చోరీ కేసుకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని వారి నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు. ఈ మేరకు శనివారం వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక సంతకాల బ్రిడ్జి వద్ద ఆటో ఎక్కి, కలెక్టరేట్ వద్ద ఆటో దిగిన సబ్బవరం మండలం టిక్కలిపాలెం గ్రామానికి చెందిన మంచాడ సునీతను ఏప్రిల్ 12న అదే ఆటోలో ప్రయాణించిన ఇద్దరు మహిళలు ఆటో నుంచి తోసివేసి, ఆమె చేతిలో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌తో సహా తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను తీసుకుని అక్కడ సమీపంలో ఉన్న సందుల్లోకి పారిపోయినట్లు బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ జె.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టి నేరానికి పాల్పడిన ఇద్దరు మహిళలను వంగర మండలం పోతుల గుమ్మ గ్రామానికి చెందిన ఆవుల పార్వతి, కొత్తవలస 202 కాలనీకి చెందిన గంటా మీనాలుగా గుర్తించారు. నిందితులు చోరీ సొత్తును అమ్మేందుకు శనివారం పట్టణంలో తిరుగుతుండగా వారిని గుర్తించి, అరెస్టు చేసి, వారి నుంచి తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. బాధితురాలు సునీత బొబ్బిలిలో తన అక్క కొడుకు నిశ్చితార్థానికి వెళ్లే క్రమంలో కెఎల్.పురంలో ఉన్న తన అక్క కూతురు ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కినట్లు ఆయన తెలిపారు. నేరం జరిగి, ఫిర్యాదు చేసిన ఐదు గంటల వ్యవధిలోనే వన్‌టౌన్ క్రైమ్ బృందం నిందితులను గుర్తించి, అరెస్టు చేసి, రికవరీ చేసినందుకు విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ బి.వెంకటరావులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట 11 కేవీ ఫీడర్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ పి.హరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీతారామునిపేట, గొర్లిపేట, కొత్తపేట, దీపిల్లిపేట, తుమ్మలపేట, జగ్గరాజుపేట, దన్నానపేట, కోరాడపేట, కుదిపి, నీలంరాజుపేట, ఏటీ అగ్రహారం గ్రామాలతో పాటు 11 కేవీ తాగునీటి పథకాలకు, పట్టణంలోని జగనన్న హౌసింగ్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, మిమ్స్ ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు వెల్లడించారు.

అక్కివరం, రాజుపులోవ సబ్‌స్టేషన్ల పరిధిలో రేపు

డెంకాడ: మండలంలోని అక్కివరం, రాజుపులోవ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో చేపడుతున్న లైన్ల నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 15న పలు గ్రామాలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.సురేష్‌బాబు శనివారం తెలిపారు. గొలగాం, గంట్లాం గ్రామాల్లో పూర్తిగా, అక్కివరం , డి.తాళ్లవలస గ్రామాల్లోని కొంత భాగానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మోపాడ, జగన్నాథపురం గ్రామాలకు పూర్తిగా, మోదవలస గ్రామంలో కొంత భాగంకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

- **పూసపాటిరేగ:** మండలంలోని గోవిందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ పనులు చేస్తున్నందున పలు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ జి.సురేస్‌బాబు తెలిపారు. గోవిందపురం, ఎల్‌పీ పాలెం, భరిణికాం, వెంపడాం, తాళ్లపేట, సేరిపేట, తొత్తడాం గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

రేపు పలు గ్రామాల్లో..

- **భోగాపురం:** ఈనెల 15న మండలంలోని ముక్కాం, ముంజేరు, రామచంద్రపేట, కొంగవానిపాలెం, మెట్ట సబ్బన్నపేట, నందిగాం, తోటపల్లి, దిబ్బలపాలెం, చేపలకంచేరు, బమ్మిడిపేట, గాబువానిపేట, కొండ్రాజుపాలెం, జగ్గయ్యపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ షేక్ మస్తావలీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒడిశా సరిహద్దు గ్రామాల్లో నిఘా కట్టుదిట్టం


- ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు

పార్వతీపురం టౌన్: ఒడిశా సరిహద్దు గ్రామాల్లో భద్రత కట్టుదిట్టం చేశామని ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు అన్నారు. స్థానిక ఎస్ఈబీ సూపరింటెండెంట్ కార్యాలయంలో జిల్లాలో గల సీఐలు, ఎస్ఐలతో శనివారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని మరింత అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతీ వాహనానికి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఒడిశా నుంచి అక్రమంగా సారా, గంజాయి రవాణా కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని ఆయన తెలిపారు. నిఘా మరింత పటిష్ఠపరచి అనుమానం ఉన్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సిబ్బంది మరింత కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



పూజలందుకుంటున్న సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలు

వీరఘట్టం: మండలంలో బూరుగ గ్రామంలో మూ డు రోజులుగా జరుగుతున్న రామాలయ ప్రతిష్ట మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరో జు ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు సర్వాజోశ్యుల సతీష్ శర్మ, రమేష్ శర్మ అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు రాములవారి కల్యాణాన్ని కన్నులారా వీక్షించి తరించారు. కల్యాణ అక్షితలు చల్లుకుని సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు.